క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



విజయవాడరూరల్: మైలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం కోసం కృషి చేయాలని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ జాయింట్ సెక్రటరీగా పైడూరుపాడు గ్రామానికి చెందిన కొమ్ముకూరి ప్రసాద్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో మైలవరంలోని పార్టీ కార్యాలయంలో తిరుపతిరావును గురువారం ప్రసాద్ కలిశారు. పైడూరుపాడు సర్పంచి వేముల సీతారామయ్య, గ్రామ పార్టీ నాయకుడు డొక్కా వెంకటరత్నం పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి కంప్యూటర్ల వితరణ



ఇబ్రహీంపట్నం: స్వర్ణ టోల్‌వే సంస్థ ఆధ్వర్యంలోని స్థానిక భవిత కేంద్రానికి రూ.15 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో 15 కంప్యూటర్లు, 15 ప్రింటర్లు, 19 ట్రంపోలిన్స్ (దివ్యాంగుల పరికరాలు) గురువారం అందజేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు కిరణ్‌బాబు, కార్యదర్శి రమణసాయి మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం పొందేందుకు రూ.15 లక్షలతో ఈ పరికరాలు అందించామన్నారు. ఎంఈఓలు సీహెచ్ పుష్పలత, శ్యామ్‌బాబు, డీజీఓ రాజారావు, టోల్ మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ మేనేజర్ శ్రీనివాస్, జిల్లా ఐడీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్రా ఫార్మసీ కాలేజీలో క్యాంపస్ సెలక్షన్లు



జూపూడి(ఇబ్రహీంపట్నం): స్థానిక నిమ్రా ఫార్మసీ కళాశాలలో గురువారం క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన దివీస్ ఫార్మాస్యూటికల్స్ హెచ్‌ఆర్ మేనేజర్ హరికృష్ణ విద్యార్థులకు వివిధ దశల్లో ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించారు. మొత్తం 75 మంది సెలక్షన్స్‌లో పాల్గొనగా 45 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, డెప్యూటీ డైరెక్టర్ తమ్మినేని నారాయణమూర్తి, గులాంగౌస్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి అభినందించారు.

గుంటుపల్లిలో పోలీసుల కవాతు



ఇబ్రహీంపట్నం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గుంటుపల్లి గ్రామంలో పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన 100 మంది సివిల్, ఏఆర్, పారామిలటరీ బలగాలతో గుంటుపల్లి సెంటర్ నుంచి ఖాజీపేట మీదుగా ఎంపీపీ పాఠశాల వరకు ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. వెస్ట్‌జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎటువంటి అపోహలకు గురికావద్దన్నారు. సీఐ ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో వచ్చే సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గిరిజన గురుకులాల కన్వీనర్ జాన్సన్ దేవరాజ్ గురువారం తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు ఉండగా 64 ఎస్టీ, పది ఎస్సీ, రెండు ఓసీ, నాలుగు బీసీలకు కేటాయించారని పేర్కొన్నారు. ఏడో తరగతిలో మూడు, ఎనిమిదో తరగతిలో ఒకటి, తొమ్మిదో తరగతిలో రెండు బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయని, వాటికి గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులని వివరించారు. అర్హులు ఏప్రిల్ పదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు

తిరువూరు: రంజాన్ మాస సందర్భంగా తిరువూరు పాతబస్టాండు సెంటర్లోని జామియా మసీదులో గురువారం రాత్రి ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విందులో పట్టణంలోని ముస్లింలు పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసే విధానాన్ని, రంజాన్ ప్రాముఖ్యతను జామియా మసీదు ఇమాం మౌల్వీ రజ్వీ వివరించారు.

నాడు - నేడుతో అభివృద్ధి ఒరబడి



రంగురంగుల ప్రహరీతో నూజివీడులోని పీఆర్‌డే స్కూల్



నాడు-నేడులో అభివృద్ధి చేసిన ముసునూరు మండలం చెక్కపల్లిలోని హైస్కూల్

- మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు
- రూ.45 కోట్లతో 120 స్కూళ్ల అభివృద్ధి
- కార్పొరేట్ బడులకు దీటుగా హంగులు



ఆగిరిపల్లి నుగొండపల్లిలో అభివృద్ధి చేసిన ప్రాథమికోన్నత పాఠశాల



నూజివీడు: 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లో రూపొందుతుంది' అన్న మహాత్మాగాంధీ మాటలతో విద్యకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో, దేశాభివృద్ధిలో ఎంత కీలకమైనదో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దేశానికి ఉపయోగపడే భావి భారత పౌరులను తీర్చిదిద్దే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. పెచ్చులూడిన శ్లాబులు, విరిగిన బల్లలు, పగిలిన గచ్చులు, నేలపై కూర్చునే విద్యార్థులు, విద్యుత్ సదుపాయం లేని చీకటి గదులు, బాత్‌రూమ్‌లు లేని పాఠశాలలు గతంలో ఉండేవి. 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పాలనలో అవి దర్శనమిచ్చేవి. అదంతా గతం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు నిరంతరం కృషి చేశారు. దీనిలో భాగంగానే మనబడి నాడు-నేడు కార్యక్రమాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ బడులకు దీటుగా తీర్చిదిద్దారు. ముఖ్యమంత్రి ఆలోచనల్లో ఉద్భవించిన నాడు-నేడు పథకంతో సర్కారు బడులన్నీ కొత్త హంగులు సంతరించుకున్నాయి.

మండలం	అభివృద్ధి చేసిన పాఠశాలల సంఖ్య	కేటాయించిన నిధులు (రూ. కోట్లలో)
నూజివీడు	42	15
ఆగిరిపల్లి	30	13
ముసునూరు	25	10
చాట్రాయి	23	7
మొత్తం	120	45

ప్రభుత్వ పాఠశాలలు అన్ని సదుపాయాలతో ఆహ్లాదకరంగా, అందంగా ముస్తాబయ్యాయి. నాడు - నేడు మొదటి విడతలో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి రూ.45 కోట్లతో 120 పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఈ పాఠశాలలు విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి. తరగతి గదుల్లో డెస్క్‌లతో కూడిన బెంచీలు, విద్యుత్ సదుపాయం, టైల్స్, బ్లాక్‌బోర్డు స్థానంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ), స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, యూనిఫాం, బూట్లు అన్నీ ఉచితంగా అందిస్తున్నారు. ఒకప్పుడు తాగడానికి మంచినీరు లేని పరిస్థితి నుంచి నేడు హైస్కూళ్లలో మినరల్ వాటర్ సదుపాయాన్ని విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఇన్ని సౌకర్యాలు గతంలో లేవు



నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలనే మార్చివేసింది. ప్రభుత్వ బడులు ఈ విధంగా అభివృద్ధి చెందుతాయని గతంలో ఎప్పుడూ ఊహించలేదు. ఐఎఫ్‌పీలతో విద్యార్థులకు బోధన చేస్తున్నారు. అన్ని సదుపాయాలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. విద్యార్థులకు ఇంత చక్కని సౌకర్యాలు గతంలో ఎప్పుడూ లేవు.

– షేక్ మస్తాన్ వలీ, నూజివీడు

ముస్లింలకు ఇఫ్తార్ విందు



విస్సన్నపేట: రంజాన్ సందర్భంగా ముస్లిం నాయకుడు షేక్ షరీఫ్ ఆధ్వర్యంలో రాజీవ్ కాలనీలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి ముస్లింలకు భోజనం వడ్డించారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు మల్లయ్య, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యారాణి, కోఆప్షన్ మాజీ సభ్యుడు దస్తగిరి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోనే కాన్పులు జరగాలి

తిరువూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే గర్భిణులు కాన్పులు చేయించుకునేలా ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుహాసిని ఆదేశించారు. తిరువూరు మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలో పేదలకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గర్భిణులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభిస్తున్న సేవలను ఆశా వర్కర్లు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు తెలపాలన్నారు. పీహెచ్‌సీలలో కాన్పులు చేయని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీకి కౌన్సిలర్ భూలక్ష్మి రాజీనామా



రాజీనామా పత్రం చూపిస్తున్న కౌన్సిలర్ భూలక్ష్మి

ఇబ్రహీంపట్నం: టీడీపీ అధినేత చంద్రబాబు బీసీలపై చిన్నచూపు చూస్తున్నాడనే కారణంతో ఆ పార్టీకి రాజీనామా చేశానని కొండపల్లి 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్ ముప్పసాని భూలక్ష్మి తెలిపారు. మునిసిపల్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. తన రాజీనామాను ఆమోదించాలని నియోజకవర్గం ఇన్‌చార్జ్ దేవినేని ఉమామహేశ్వరరావును కోరతానన్నారు. కౌన్సిల్లో తనను స్వతంత్ర కౌన్సిలర్‌గా పరిగణించాలని కమిషనర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్రబాబు చెప్పే మాటలకు, చేతలకు పొంతన ఉండదని భూలక్ష్మి విమర్శించారు. విజయవాడ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ ఒక్క సీటు కూడా బీసీలకు కేటాయించకపోవడం దారుణమన్నారు. టీడీపీలో బీసీలకు ఎదుగుదల ఉండదని తేల్చిచెప్పారు. మైలవరంలో బీసీలు అధికంగా ఉన్నందున వైఎస్సార్ సీపీ బీసీ అభ్యర్థికి సీటు ఖరారు చేసిందని పేర్కొన్నారు. తనకు టీడీపీ సీటు ఖరారు చేయాలని నియోజకవర్గం నేతలతో పాటు చంద్రబాబును గతంలో కోరినా, తనమాట పెడచెవిన పెట్టారని విమర్శించారు.

ఘనంగా ప్రారంభమైన నిష్కళంక మాత మహోత్సవాలు



వలసపల్లిలో నిష్కళంక మాత భక్తుల ర్యాలీ

ముసునూరు: నిష్కళంకమాత ఉత్సవాల్లో వేలాదిగా విశ్వాసులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఓఎంఐ నోవిస్ మాస్టర్ రెవ ఫాదర్ జోయ్ అమల్ పిలుపునిచ్చారు. ముసునూరు ఆర్సీఎం విచారణ పరిధిలోని నెహ్రూనగర్ పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ జోసఫ్‌తంబి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పతాకావిష్కరణ చేసి నిష్కళంక మాత మహోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది విశ్వాసుల, భక్తుల కోరికలు తీరుస్తూ, దీక్షపరుల క్రీస్తుశ్రమల 40 రోజుల ఉపవాస ప్రార్థనలకు ప్రతీకగా నిలుస్తున్న మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా స్థానిక సెయింట్ జోసఫ్ యూత్ ఆధ్వర్యంలో విచారణ పరిధిలోని గ్రామాలను కలుపుతూ వలసపల్లి నుంచి నెహ్రూనగర్ వరకు 33 కిలోమీటర్ల మేర బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నెహ్రూనగర్ గ్రామ వీధుల్లో నిష్కళంక మాత తేరు ప్రదక్షిణ, జపమాల, భక్తి గీతాలాపన నిర్వహించారు. ఓఎంఐ సీనియర్ అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ప్రగాశం దివ్య బలిపూజ సమర్పించగా, ఫాదర ఏసురత్నం (బాల) భక్తులు, విశ్వాసులకు వాక్య సందేశాన్ని అందించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఫాదర్లు జాన్‌భారతి, గాంధీరాజ, రాజశేఖర్, నిర్మల్‌కుమార్, సిస్టర్లు, ఉపదేశులు ఆంతోని, బెనర్జీ, స్వామిదాసు, లాజరు, భూషణం, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

నియమావళిని పక్కాగా అమలు చేయాలి

నూజివీడు: గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేసే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బూర్వంచ, పాతరావిచర్ల, కొత్త రావిచర్లలోని గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించి సిబ్బందికి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎక్కడా కూడా రాజకీయ పార్టీల బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా అనుమతి లేకుండా రాజకీయ పార్టీలు సమావేశాలు నిర్వహిస్తుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాహనాలపై రాజకీయ పార్టీ నాయకుల స్టిక్కర్లు ఉన్నా, జెండాలున్నా వాటిని తొలగించాలన్నారు. ఎన్నికల విధుల విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టోఫెల్‌తో ఉపాధి అవకాశాలు

తిరువూరు: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి టోఫెల్ వంటి పరీక్షలు దోహదపడతాయని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్ పేర్కొన్నారు. తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు టోఫెల్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంగ్లంలో పరిజ్ఞానం సాధించిన విద్యార్థులు విదేశాలకు వెళ్లడానికి టోఫెల్ వంటి పరీక్షలు దోహదపడతాయన్నారు. ఆంగ్ల వ్యాకరణంలో మెలకువలు తెలుసుకోడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. రోజూ ఆంగ్ల దినపత్రికలు చదివితే భాషపై పట్టు వస్తుందని సూచించారు. విదేశీ విశ్వవిద్యాలయాలు ఆంగ్ల భాషా వ్యాప్తికి అందిస్తున్న ఉపకారవేతనాలను గురించి వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని గుంటుపల్లి పోలీస్ చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో ఓ కారులో 100 గ్రాముల గంజాయితో వెళ్తున్న ముగ్గురిని బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన పవన్ కుమార్, శివప్రసాద్ చిట్టి, పునీత్‌గౌడ్ కారులో ప్రయాణిస్తూ గుంటుపల్లి చెక్‌పోస్టు వద్దకు వచ్చారు. ఎస్‌ఐ అనూష ఆ చెక్ పోస్ట్ వద్ద కారును తనిఖీచేశారు. వంద గ్రాముల గంజాయి లభించడంతో ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యనారాయణ తెలిపారు.

వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు



జి.కొండూరు: మండలంలోని వెల్లటూరు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కోమారి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం విశేష పంచామృతాభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన చేశారు. సాయంత్రం ప్రార్థనా సూక్తం, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన, రక్షాబంధన, దీక్షాచరణ, అజస్రదీపారాధన, మృత్యుంగ్రహణ, అంకురారోపన, ఆఘారం, వాస్తుపూజ, వాస్తు హోమం, గరుడ ప్రతిష్ఠ, హోత్ర ప్రశంస నిర్వహించారు.

లైంగికదాడి యత్నం కేసులో నిందితుడి అరెస్టు

మైలవరం: యువతిపై లైంగికదాడికి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 17న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. మైలవరం - విజయవాడ రోడ్డులోని ఓ హాస్పిటల్‌లో పనిచేస్తున్న యువతిపై మేనేజర్ మట్టా రమేష్ మద్యం మత్తులో లైంగికదాడికి యత్నించాడు. హాస్పిటల్‌లో పనిచేస్తున్న వ్యక్తితో చనువుగా ఉంటున్నావంటూ అక్కడే పనిచేసే యువతిని బెదిరించి రమేష్ లైంగికదాడికి యత్నించాడు. యువతి స్వల్పంగా గాయపడింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకుంది. దాడి విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ రమేష్ ఆమెను బెదిరించాడు. దీంతో ఆమె ఎవరికీ దాడి విషయం చెప్పలేదు. రెండు రోజులుగా యువతి ఆందోళనగా ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు ప్రశ్నించడంతో ఏడుస్తూ జరిగిన ఘటనను వారికి తెలిపింది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటబెట్టుకుని 19వ తేదీ రాత్రి హాస్పిటల్‌కు వెళ్లి మేనేజర్ రమేష్‌ను ప్రశ్నించగా మద్యం మత్తులో ఉన్న అతను వారితో దురుసుగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లైంగిదాడికి యత్నం ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

పీహెచ్‌సీలో ప్రసూతి సేవలు పునఃప్రారంభం

ముసునూరు: స్థానిక పీహెచ్‌సీలో ప్రసూతి వైద్య సేవలు పునఃప్రారంభమైనట్లు వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ భవన సముదాయానికి మరమ్మతులు చేపట్టారు. దీంతో పీహెచ్‌సీలో ప్రసూతి సేవలకు ఆటంకం ఏర్పడింది. ఇటీవల పనులన్నీ పూర్తి కావడంతో నిలిచిపోయిన ప్రసూతి సేవలను నాలుగేళ్ల అనంతరం తిరిగి ప్రారంభించారు. గురువారం గ్రామానికి చెందిన గర్భిణికి కాన్పు నిర్వహించగా, మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఆస్పత్రికి భారీగా మరమ్మతులు చేయించడంతో నూజివీడు వరకు వెళ్లే పనిలేకుండా గ్రామంలోనే కాన్పులు చేస్తుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం

చెక్కపల్లి (ముసునూరు): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని, ఆ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ వాసు సూచించారు. చెక్కపల్లి సెంటర్‌లో ప్రజలకు ఓటు హక్కుపై గురువారం సాయంత్రం అవగాహన సదస్సు జరిగింది. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, ఆ హక్కును సద్వినియోగం చేసుకుని మంచి నేతలను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు ప్రతి ఒక్కరి జన్మ హక్కు

మైలవరం: ఓటు ప్రతి ఒక్కరి జన్మ హక్కని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల దత్తత గ్రామం మండలంలోని కనిమెర్ల తండాలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా గురువారం కనిమెర్ల తండా, పోరాటనగర్, వెదురుబీడెం గ్రామాలలో కళాశాల వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అర్హులు అందరూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21వ తేదీన ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెట్ల పెంపకంతో పాటు అడవుల నరికివేతను అడ్డుకోవడం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ అడవుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆగిరిపల్లి: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గురువారం ఆగిరిపల్లిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ సురేంద్ర కుమార్ తన సిబ్బందితో కలిసి విజయవాడ రోడ్డులోని సాయిబాబా గుడి వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమతికి మించి నగదు తరలిస్తే సీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

నేటి నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ప్రచారం

మైలవరం: రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట నుంచి శుక్రవారం ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తెలిపారు. మైలవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అన్నేరావుపేట నుంచి ఉదయం ఎనిమిది గంటలకు ప్రచారం ప్రారంభిస్తానని పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు మద్దులపర్వ, పది గంటలకు శ్రీరామ్‌పురం, 11 గంటలకు ముచ్చనపల్లి, 12 గంటలకు కూనపురాజు పర్వ, మధ్యాహ్నం ఒంటి గంటకు కుదప గ్రామంలో పార్టీ ప్రచారం కొనసాగుతుందని వివరించారు. పార్టీ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్ని సోషల్ మీడియా చానల్స్‌లో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. తిరుపతిరావు తొలిసారిగా పోటీచేస్తున్న నేపథ్యంలో ఆయనకు సీనియర్ల ద్వారా సూచనలు, సలహాలు ఇవ్వడానికి కర్ర హర్షవర్ధన్‌రెడ్డిని రెండో పరిశీలకుడిగా పార్టీ నియమించిందని తెలిపారు. సోషల్ మీడియా వాస్తవాలు తెలుసుకుని వార్తలు ఇస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన



ముక్కొల్లుపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

నూజివీడు: రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ముక్కొల్లుపాడులో గురువారం రాత్రి అభిమానులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్దరబోయిన మాట్లాడుతూ గతంలో రెండుసార్లు గెలిచే సమయంలో తనకు టికెట్ ఇవ్వకుండా టీడీపీ అధినేత చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని కొందరు నాయకులు కూడా తనకు టికెట్ రాకుండా కుట్రలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పదేళ్ల పాటు టీడీపీ బలోపేతానికి పాటుపడ్డానని, చంద్రబాబు నూజివీడు వచ్చినప్పుడు కూడా టికెట్ తనకేనని చెప్పారని, తీరా ఇప్పుడు స్థానికేతరుడు, వేరే పార్టీకి చెందిన ఎమ్మెల్యేకు టికెట్ ఇచ్చారని, ఇంతకన్నా దారుణం ఇంకెక్కడైనా ఉంటుందా అని ప్రశ్నించారు. తనకు మోసం చేయడం, మాయమాటలు చెప్పడం రాదని, నమ్మిన కార్యకర్తలకు అండగా ఉండటమే తనకు తెలుసునన్నారు. తాను చేసిన తప్పు ఏమిటి, తనకు సీటు ఇవ్వకపోవడానికి కారణమేమిటో చెప్పమంటే ఒక్క నాయకుడు కూడా నోరు మెదపడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీలో ఉండే తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మైలవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సీడీపీఓ కె.పుష్పలత పేర్కొన్నారు. మైలవరం ఐసీడీఎస్ కార్యాలయంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంపూర్ణ పోషకాహారం, బాల్య వివాహాలపై సీడీపీఓ పుష్పలత అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు జరిగింది. చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిక విలువలతో కూడిన సమతుల ఆహారాన్ని అందించడం వలన వారు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, యువతులకు 18, యువకులకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేయాలని స్పష్టంచేశారు. బాల్య వివాహాలు, మేనరిక వివాహాలు చేయడం వల్ల పిల్లలు బలహీనంగా, అంగవైకల్యంతో పుట్టే అవకాశం ఉందని హెచ్చరించారు. శరీర పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్య వంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చన్నారు. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ యస్ టు పోషన్ ప్రాజక్టు కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్, బ్లాక్ కోఆర్డినేటర్ కె.శిరీష పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మంచి పోషకాహార పదార్థాలను ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేశారు. సూపర్‌వైజర్ గౌసియా బేగం, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన అవసరం

మైలవరం: జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సూచించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ.. కళాశాలలో నిర్వహిస్తున్న సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవశ్యకత, రోజు వారి జీవితంలో ఎలా ఉపయోగించాలనే అంశాలపై ఇండియన్ సర్వర్స్ సీఈఓ డి.సాయి సతీష్ అవగాహన కల్పించారు. డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వీరయ్య పాల్గొన్నారు.